క్లుప్తంగా

గంజాయి రవాణాపై గట్టి నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు

గుర్ల: గంజాయి రవాణాపై నిఘా పెంచాలని స్థానిక ఎస్ఐ నారాయణరావు,పోలీస్ సిబ్బందిని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులు, ఎఫ్ఐఆర్ కాపీలు, కేసుల వివరాలను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలతో పాటు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ వెంట సీఐ శంకరరావు ఉన్నారు.

సాయిగౌతమ్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సాయిగౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.నాయుడు

గజపతినగరం: మధుపాడ గ్రామంలోని సాయి గౌతమ్ ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు పాఠశాలకు నేషనల్ ఎక్స్‌లెన్స్ ఎడ్యుకేషన్ అవార్డు దక్కింది. విద్య, సాంస్కృతిక, కళారంగాల్లో విశేష సేవలు అందిస్తున్న సంస్థలు, వ్యక్తులకు హైదరాబాద్‌కు చెందిన ఎథిక్స్ సంస్థ 2024–25 సంవత్సరానికి అవార్డులు అందజేసింది. విద్యారంగంలో సాయిగౌతమ్ స్కూల్‌కు అవార్డు వచ్చింది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఎథిక్స్ సంస్థ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. నాయుడు అవార్డు అందుకున్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

దత్తిరాజేరు: టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి రఘు అన్నారు. ఇంగిలాపల్లి గ్రామంలో సోమవారం టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జలుబు, జ్వరం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం టీబీ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు సామూహిక గీతా పారాయణం

చీపురుపల్లి: గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గీతామందిరంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సామూహిక సంపూర్ణ గీతా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గీతాసత్సంగ్ సేవాశ్రమ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 5 గంటలకు ఆర్యసమాజం నేతృత్వంలో ప్రబోధాత్మక దేశభక్తి భజనోపదేశములు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 11న శ్రీమద్భగవద్గీత అష్టోత్తర శతనామావళి, సామూహిక గీతా పారాయణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మురళీ కృష్ణ (ఫైల్)

గజపతినగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లోగిశ గ్రామానికి చెందిన తలుపుల మురళీకృష్ణ (30) విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు..15రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళుతున్న మురళీ కృష్ణను నెల్లిమర్ల మండలం పారసాం గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ని కుటుంబ సభ్యులు విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కెంగువలో వైద్య శిబిరం

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామ సచివాలయంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బందితో కలిసి 71 మందికి వైద్యాధికారి వివిధ వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు.

చోరీ నిందితుడికి రిమాండ్

లక్కవరపుకోట: మండలంలోని గోల్డుస్టార్ జంక్షన్ వద్ద ఉన్న కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగిన చోరీకి సంబంధించి రెల్లిగౌరమ్మపేటకి చెందిన బత్తిన ఎర్నిమోహన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని కొత్తవలస కోర్టులో సోమవారం హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. కల్యాణ మండపంలో ఒక వివాహానికి హాజరైన దంపతుల బ్యాగు నుంచి అరతులం బంగారం, రూ.5 వేల నగదు, ఒకసెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తుండగా.. ఆర్‌జీపేట, గోల్డుస్టార్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందుతుడు మోహన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. నిందితుడి నుంచి అరతులం బంగారం, రూ.3 వేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్నేహ హస్తం

- విద్య, వైద్యం,ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సేవలు
- పుష్కరకాలంగా సేవలందిస్తున్న స్నేహ సంస్థ



'స్నేహ' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం(ఫైల్)

శృంగవరపుకోట: వారంతా విభిన్న రంగాల్లో ఉద్యోగాలు,వ్యాపారాలు చేస్తున్నారు. సమాజానికి తమ వంతుగా సేవలు అందివ్వాలనే ఆలోచన చేశా రు. ప్రజలకు సేవ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడడం సామాజిక బాధ్యతగా భావించారు. తమ ఆలోచనల నుంచి పుట్టిన సంస్థకు 'స్నేహ'(సొసైటీ ఫర్ నేచర్ ఎడ్యుకేషన్, హెల్త్ అసోసియేషన్)గా పేరు పెట్టారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో, పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఎస్.కోట కేంద్రంగా కొద్ది మంది సభ్యులతో 2012 మార్చి 8న ప్రారంభమైన 'స్నేహ' సంస్థ ప్రస్తుతం 65 మంది సభ్యులతో ఎస్.కోట నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో పుష్కర కాలంగా సేవలందిస్తోంది.

12 ఏళ్లు..200కిపైగా సేవలు

స్నేహ సంస్థ ఏర్పాటు చేసి 12 ఏళ్లు పూర్తయింది. సుమారు 200కిపైగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సభ్యులంతా సంస్థకు తమ వంతు విరాళాలు అందించడంతో పాటు తమ స్నేహితులు, బంధువులను భాగస్వాముల్ని చేసి పేదలకు సేవలందిస్తున్నారు. సమాజంలో నిరుపేదలను గుర్తించి, వారికి నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయడం, పేద విద్యార్థులకు విద్యాసామగ్రి సమకూర్చడం, రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో కూడా తమ బాధ్యతగా పేదలకు నిత్యావసర సరుకులు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తూ, పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ఏటా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హోప్ టెస్టులు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. మెడికల్ క్యాంపులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తూ వైద్యపరంగా తమ వంతు సాయం చేస్తున్నారు. ప్రజారోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని ఫణంగాపెట్టి పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం దుస్తులు, గ్లౌజులు, ఇతర సామగ్రి అందిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటడంతో పాటు పంపిణీ చేశారు. పర్యావరణ హితం ఏటా వినాయక చవితి పండగకు మట్టి గణపతి ప్రతిమలను పంచుతూ, సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఉమెన్స్, సీనియర్ సిటిజన్స్ దినోత్సవాలను నిర్వహించి వేర్వేరు రంగాల్లో సేవలందించిన మహిళలు, వృద్ధులను సన్మానించి, వృద్ధులను, మహిళలను గౌరవించుకోవాలని సమాజానికి సందేశాన్ని పంపిస్తున్నారు.



కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న 'స్నేహ' సంస్థ సభ్యులు (ఫైల్)

రిక్షా పుల్లర్లకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న స్నేహ సంస్థ సభ్యులు

శీతాకాలం కావడంతో స్థానిక 'స్నేహ'స్వచ్ఛంద సంస్థ సభ్యులు పుణ్యగిరి గ్రామంలో 30 మంది రిక్షా పుల్లర్లకు సోమవారం రగ్గులు పంపిణీ చేశారు. ఎం.భాస్కరరావు, ఎస్.ఈశ్వరరావు ఆర్థిక సహకారంతో రగ్గులు పంపిణీ చేశామని సంస్థ అధ్యక్షుడు ఏ.ఎస్.వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు, సభ్యులు డాక్టర్ త్రినాథరావు, ఎం.ఎస్.ఎన్.మూర్తి, వి.శ్రీరామ్మూర్తి, వి.మురళి, ప్రకాష్, రమేష్, దేముడు, ఎం.శ్రీనివాసరావు, మధు, ఎం.డి.ఎస్.ప్రసాద్, అప్పలరాజు, షేక్ షఫీ, గణేష్, కె.శ్రీను, ప్రవీణ్, పి.శ్రీరాములు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న 'స్నేహ' సభ్యులు (ఫైల్)



పేదలకు దుప్పట్లు రగ్గులు పంచుతున్న 'స్నేహ' సభ్యులు (ఫైల్)

సభ్యుల సహకారంతో..



'స్నేహ' సంస్థను ఏర్పాటు చేసి 12 ఏళ్లు పూర్తయ్యాయి. సభ్యుల సహకారంతోనే ఇన్ని రకాల సేవలు సాధ్యమయ్యాయి. సేవాకార్యక్రమాల కోసం సభ్యులు ఏటా ఇతోధికంగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. సభ్యులందరి లక్ష్యం సేవే కావడంతో ఇన్నేళ్లు సమష్టిగా ఏన్నో సేవలందించాం. ముున్ముందు మరిన్ని సేవలందిస్తాం.

– ఏ.ఎస్.వెంకటరావు, 'స్నేహ' సంస్థ అధ్యక్షుడు

సంతోషంగా ఉంది



పేదలకు, సమాజానికి మా వంతు సేవలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది. సంస్థలో చాలా మంది వైద్యులం ఉన్నాం. ఉచితంగా వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. మాతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, వ్యాపారాలు చేస్తున్న వారు ఉన్నారు. అంతా కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం.

– డాక్టర్ ఏలూరి సీతారత్నం, 'స్నేహ' సంస్థ సభ్యురాలు

క్షయను తరిమేద్దాం



క్షయ రహిత దేశమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు రచించాయని, వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించుకుని ఆరోగ్య జాగ్రత్తలు పాటించి సమాజం నుంచి క్షయ వ్యాధిని తరిమికొట్టాలని హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న అన్నారు. వసంత గ్రామంలో క్షయ వ్యాధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యాధిసోకిన వారు ఆరు నెలలు పాటు మందులు వాడి, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ శిరికి అచ్చియ్యమ్మ,సీహెచ్ఓ కామేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – గంట్యాడ

అధ్వానంగా..



చిత్రంలో కనిపిస్తున్నది గరివిడి మండలంలోని ఏనుగువలస పంచాయతీ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి. 2012లో బొత్స సత్యనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ఈ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసి 12 ఏళ్లు కావడంతో ప్రస్తుతం ఎక్కడికక్కడ గోతులు తేలి అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహన చోదకులు అదుపుతప్పి గోతుల్లో పడిపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– చీపురుపల్లిరూరల్(గరివిడి)

నిరంతర ఆదాయం



ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలను సాగు చేయడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ఆర్‌టీఐ ప్రకాష్ రైతులకు సూచించారు. ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన పొలాల్లో అపరాలు, నవధాన్యాల సాగుపై, పొలం గట్లపై కూరగాయలు, ఇతర పంటల సాగుపై దేవుపల్లి గ్రామంలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్యాసి నాయుడు,సత్యవతి,రామునాయుడు,ఎం.అప్పలనాయుడు, ఎస్.అప్పలనాయుడు,పైడిరాజు, కొండమ్మ పాల్గొన్నారు.

– బొండపల్లి

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈఓ మాణిక్యంనాయుడు

లక్కవరపుకోట: జిల్లా పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత శాతం సాధించడమే లక్ష్యంగా 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విలేకరు లతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 17,316 మంది,ప్రైవేట్ పాఠశాలల నుంచి 6,361 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. శతశాతం ఉతీర్ణత సాధించేందుకు డిసంబర్–1 నుంచి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ఆ సబ్జెక్టులను ఉదయం బోధించి, సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక స్టడీమెటీరియల్‌ను కూడా సమకూర్చామన్నారు. ఆయన వెంట ఎంఈఓ సీహెచ్.కూర్మారావు ఉన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పద్మావతి

కొత్తవలస: వైద్యారోగ్యశాఖలో రెండు దశాబ్దాలుగా,కోవిడ్ సమయంలో ప్రాణాలు తెగించి సేవలందించిన హెల్త్ మేల్ అసిస్టెంట్ల (ఆరోగ్య కార్యకర్తలు)ను ప్రభుత్వం విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఏపీ గవర్నమెంట్ మెడికల్, హెల్త్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) నాయకులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శులు ఎల్.సత్యారావు, టి.పద్మావతి, సీహెచ్. ఈశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం రాష్ట్రంలో 1,200 మందిని, జిల్లాలో 56 మందిని తొలగించడం అన్యాయమన్నారు. వీరంతా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీఓ నంబర్ 1207 ఆధారంగా నియమితులయ్యారని, వీరి వయస్సు ప్రస్తుతం 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ప్రభుత్వ అనాలోచితంగా, కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని వీరిని తొలగించడం సరికాదని, ఈవయస్సులో వారు కొత్తగా ఏ ఉద్యోగాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచన చేసి మళ్లీ వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు




శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు సూచించారు. ఎన్నికల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 14న మండలంలోని మైనర్, మీడియం ఇరిగేషన్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకుండా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపీడీఓ జి.గిరిబాల, ఇరిగేషన్ ఏఈ ఆవాల సూరీడు తదితరులు పాల్గొన్నారు.

12 సంఘాలకు ఎన్నికలు

మండలంలో 12 సాగునీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ ఆవాల సూరీడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఛానల్ మీడియం సాగునీటి సంఘంతో పాటు గరుడుబిల్లి, కొత్తపాలెం, బి.రాజేరులో రెండేసి చొప్పున మైనర్ సంఘాలకు చిన్నతామరాపల్లి, గొల్లుపాలెం,మరువాడ, కొత్తవలస, జి.గుమడాం గ్రామాలకు సంబంధించి ఒక్కో సంఘానికి ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. 11వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని,14న నామినేషన్లు,పోలింగ్ ,కౌటింగ్ ఉంటుందని తెలిపారు. చేతులు ఎత్తే విధానంలో, అభ్యంతరాలు ఉన్న చోట రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికలకు 84 మంది అధికారులతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

వసతిగృహాల్లో పర్యవేక్షణ కరువు



హాస్టల్ వద్ద విద్యార్థినులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్తవలస: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో అధికారుల పర్యవేక్షణ కరువైయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకటేష్ ఆరోపించారు. కొత్తవలస బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులను చిత్రహింసలు పెడుతూ, వేధిస్తున్న వార్డెన్ నీరజాకుమారిపై జిల్లా బీసీ సంక్షేమ అధికారి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హాస్టల్ వద్ద సోమవారం రాత్రి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థినులకు సంరక్షణగా ఉండాల్సిన వార్డెనే భౌతికదాడులకు దిగడమేంటని ప్రశ్నించారు. ఆరు నెలలుగా మెనూ ప్రకారం భోజనం అందిచడం లేదని, విద్యార్థినులతో పనులు చేయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లాలోని పూసపాటిరేగ,విజయనగరం వసతిగృహాల్లో ఈ మధ్య ఇలాంటి ఘటనలే జరిగాయని, అయినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని మండిపడ్డారు. హాస్టల్ వద్ద విద్యార్థినులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి యశోధనరావు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటలకల్లా వార్డెన్‌కు సస్పెండ్ ఆర్డర్ ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జె.రవికుమార్,భారతి,అను, రత్న, కె.రమేష్, చైతన్య, చరణ్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో మెగా దగా మీటింగ్

- మెగా పేరెంట్స్ మీటింగ్‌ల్లో విద్యాభివృద్ధి కోసం చర్చించారా..?
- విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందడం లేదు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల7న నిర్వహించింది మెగా పేరెంట్స్ మీటింగ్ కాదని, ప్రచారం కోసం కూటమి ప్రభుత్వం నిర్వహించిన దగా మీటింగ్ అని వైఎస్సా ర్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధి, ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకుంటార న్న అంశంపై తల్లిదండ్రుల సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించలేద న్నారు. కనీసం విద్యార్థులు, తల్లిదండ్రులతో చర్చ జరిపారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా పేరెంట్స్ మీటింగ్‌లు ఎప్పటికప్పుడు జరిగేవ ని, కానీ తాము ఎప్పుడూ ఇలా ప్రచారాలు చేసుకోలేదన్నారు. విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలు, తల్లిదండ్రులు వరి కోతల పనుల్లో బిజీగా ఉన్న సమయంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించకుండా కూటమి నేతలు తమ ప్రచారం కోసం విని యోగించుకున్నారని ఆరోపించారు. అర్థ సంవత్సర పరీక్షలకు వారం ముందు నుంచే బోధన నిలిపివేసి, ఉపాధ్యాయులకు మూడు యాప్‌లు ఇచ్చి పేరెంట్స్ మీటింగ్ కోసం సమయాన్ని వృథా చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ ఇద్దరూ కలిసి ప్రభుత్వ విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో ప్రభుత్వ పాఠశాల ల్లో తీసుకొచ్చిన సంస్కరణలకు చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. సీబీఎస్‌ఈ ఎత్తేసి, ట్యాబ్‌లు ఇవ్వకుండా, అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయకుండా, పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను ఇతర ప్రాంతాలకు పంపించి విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేశారన్నారు. గత ఐదేళ్లలో మంచి మెనూతో మధ్యాహ్న భోజన పథకం అమలు జరిగేదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేదని గుర్తు చేశా రు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అన్నంలో పురుగులు కనిపిస్తున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంపై పాలకులు, అధికారుల పర్యవేక్షణ లేదని, పథకంలో లోపాలపై ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడ న్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే విద్యార్థుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు.నాయకులు పతివాడ రాజారావు, చందక గురునాయుడు, బాణాన శ్రీనివాసరావు, లక్ష్మణరావు, కోరుకొండ దాలయ్య, కర్రోతు ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

చీపురుపల్లి: నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ జి.వి.సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘంలో ఏడాదిలో నాలుగుసార్లు అవకాశాన్ని కల్పిస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగానే 2025 జనవరి-1న, ఏప్రిల్- 1, జూలై -1 అక్టోబర్-1వ తేదీల్లో ఓటర్ల నమోదుకు అవకాశ కల్పించిందని తెలిపారు. అర్హులంతా ఆయా తేదీల్లో ఫారం-6, భారతీయ పాస్‌పోర్టు కలిగి విదేశాల్లో ఉన్న వారు ఫారం -6ఏలను గ్రామాల్లోని బీఎల్ఓలకు కానీ, రెవెన్యూ కార్యాలయంలో కానీ అందజేయవచ్చి పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి

లక్కవరపుకోట: ఎస్.కోట కోర్టు భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఎమ్మెల్యేను మండల కేంద్రంలోని తన స్వగృహంలో బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం కోర్టు అద్దెభవనంలో నడుస్తోందని వివరించా రు. త్వరగా సొంత భవనం నిర్మించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. బార్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శులు బి.సత్యనారాయణ, ఎల్.అప్పారావు, కోశాధికారి బి.త్రిమూర్తులు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

స్పందించిన విద్యాశాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్...



ఎంపీడీఓ, ఎంఈఓలతో సమావేశమైన సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ ఉపేంద్ర

మెరకముడిదాం: మండలంలోని సిరియాలపేటలో చెరువును అనుకుని ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సాక్షిలో పాఠశాలకు 'ప్రహరీ నిర్మించరూ' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని సమగ్రశిక్ష అభియాన్ ఇన్‌చార్జ్ ఏఈ ఉపేంద్రను మండలానికి పంపించారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఎంఈఓలు చంద్రశేఖర్ ధర్మశ్రీనుతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ ఉపేంద్ర సమావేశమయ్యారు. సిరియాలపేట పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారు చేయాలని నిర్ణయించారు. అలాగే మండలంలో మరో 12 పాఠశాలలకు ప్రహరీలు అవసరమని ఎంఈఓలు చెప్పడంతో వాటికి కూడా ఎస్టిమేట్లు వేసి జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేస్తామని ఏఈ చెప్పారు.

అనుమతి లేకుండా కల్వర్టు నిర్మాణం



తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ పైడిపునాయుడు

గజపతినగరం: మధుపాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని జి.సి.పెంట సాగునీటి చానెల్‌పై పంచాయతీ అనుమతులు లేకుండా ప్రైవేటు లేఅవుట్ కోసం చేపడుతున్న కల్వర్టు నిర్మాణాన్ని అడ్డుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ కడుపుట్ల పైడుపునాయుడు అధికారులను కోరారు. మండల కేంద్రంలో తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీఓ బి.కళ్యాణికి సర్పంచ్ సోమవారం వినతిపత్రాలు అందజేశారు. జి.సి.పెంట చానెల్ ద్వారా వందల ఎకరాలకు సాగు నీరందుతోందని, అటువంటి చానెల్‌పై పంచాయతీ అనుమతి తీసుకోకుండా, గ్రామ పెద్దలను సంప్రదించకుండా ప్రైవేటు లేఅ వుట్ యాజమాన్యం కల్వర్టు నిర్మిస్తోందని అధికారులకు సర్పంచ్ వివరించారు. గ్రామస్థాయి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వారికి సహకరిస్తున్నారని, కల్వర్టు నిర్మిస్తే రానున్న రోజుల్లో సాగునీటి చానెల్ దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. ఈవిషయాన్ని ఇరిగేషన్ జేఈ సురేష్ వద్ద సాక్షి ప్రస్తావించగా.. కల్వర్టు నిర్మిస్తున్న విషయం తెలిసిందని, ప్రస్తుతానికి పనుల నిలిపి వేయాలని చెప్పామని, త్వరలో పరిశీలిస్తామని తెలిపారు.